అర్చకులకు గౌరవ వేతనం ఇవ్వాలి



చాంద్రాయణగుట్ట: ఆలయాల్లో కొనసాగుతున్న అర్చకులకు గౌరవ వేతనాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ ఇన్‌చార్జి బోయ నగేష్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ..చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని చెన్నకేశవ స్వామి ఆలయం, రక్షాపురం శివాలయం, పూల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కందికల్ గేట్ చిత్రగుప్త స్వామి ఆలయాల్లో ఎన్నో ఏళ్లుగా పూజారులు భగవంతుడు, భక్తుడికి అనుసంధానంగా ఉన్నారన్నారన్నారు. వారి సేవలను గుర్తించి వేతనాలు ఇవ్వాలని కోరారు.

వైశ్య యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఉదయ్ భాస్కర్



గౌలిపురా: గౌలిపురాకు చెందిన సరాబు ఉదయ్ భాస్కర్ హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎలక్షన్ ఆఫీసర్ వరుణ్ చంద్ర బొగ్గారపు ఉదయ్ భాస్కర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ..తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించినందుకు అసోసియేషన్ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న డాక్టర్ నాగనాథ్ మాశెట్టి దంపతులు

చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి దంపతులు సోమవారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్టీ శశికళ ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందినట్లు నాగనాథ్ మాశెట్టి తెలిపారు.

అన్నదానం



అబిడ్స్: చెన్నకేశవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కాజా వెంకట వసంత, గంధం సుజాత, వసుంధర, భాను, రాధాకృష్ణ, సంగి సవరయ్యల ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

శ్రీనివాసరావు మృతి తీరని లోటు



గన్‌ఫౌండ్రీ: టీఎన్జీఓస్ రాష్ట్ర కార్యదర్శి రామినేని శ్రీనివాసరావు మృతిపై టీఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు జీవితమంతా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలతోనే కొనసాగిందని, ఆయనతో చేసిన ఉద్యమ కాలాన్ని గుర్తుచేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. అదేవిధంగా టీఎన్జీఓస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కత్తూరి వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌లతో పాటు పలువురు సభ్యులు హాజరై నివాళులర్పించారు.

మిలియన్ మార్చ్‌లో న్యాయవాదుల పాత్ర కీలకం

యాకుత్‌పురా: తెలంగాణ ఉద్యమంలో నిర్వహించిన మిలియన్ మార్చ్ కార్యక్రమం 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పురానిహవేలీలోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు. మిలియన్ మార్చ్‌లో తెలంగాణ న్యాయవాదుల జేఏసీ తరఫున సిటి సివిల్ కోర్టుకు చెందిన జేఏసీ కో కన్వీనర్లు ఏ.మాణిక్ ప్రభుగౌడ్, ఎం.ఎస్ తిరుమల్ రావు, న్యాయవాదులు ఎం. వెంకటరమణ యాదవ్, పి. శివకుమార్ దాస్ ఉద్యమంలో కీలకమైన పాత్ర వహించారని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు వారి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి, ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు ప్రవీణారెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్క రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న రంజాన్ మార్కెట్లు

చార్మినార్: రంజాన్ మాసం సందర్భంగా చార్మినార్-మక్కా మసీదు ప్రధాన రోడ్డులో కొనసాగుతున్న రంజాన్ మార్కెట్ జనం రద్దీతో కళకళలాడుతోంది. వినియోగదారులతో దుకాణాలన్నీ బిజీగా మారాయి. మహిళలు రంగురంగుల గాజులను ఖరీదు చేస్తుండడంతో లాడ్‌బజార్ గాజుల దుకాణాలు మహిళల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. ముస్లిం మహిళలు రంజాన్ పండుగకు ప్రత్యేకంగా గాజులను ఖరీదు చేసి ముచ్చటగా ధరిస్తారు. పాతబస్తీ ప్రజలే కాకుండా శివారు ప్రాంతాల జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి గాజులను ఖరీదు చేస్తున్నారు. లాడ్‌బజార్, ముర్గీచౌక్, గుల్జార్‌హౌజ్, శాలిబండ తదితర ప్రాంతాలలోని అత్తర్ దుకాణాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి.

రద్దీగా వస్త్ర వ్యాపార కేంద్రాలు..

పటేల్ మార్కెట్, మదీనా, గుల్జార్‌హౌజ్, పత్తర్ గట్టీ, రికాబ్‌గంజ్, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల్లోని వస్త్ర వ్యాపార కేంద్రాలు రద్దీగా మారాయి. ఖరీదు చేసిన నూతన వస్త్రాలను వెంటనే కుట్టించుకోవడానికి టైలర్ షాపులను కూడా ఆశ్రయించడంతో పాతబస్తీ టైలర్ షాపులకు



చార్మినార్ రోడ్డులో కొనసాగుతున్న రంజాన్ మార్కెట్

కూడా గిరాకీ పెరిగింది.

కుటుంబ సభ్యులతో షాపింగ్ చేస్తూ...

ఉపవాస దీక్షలను విరమించిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా షాపింగ్ చేయడానికి చాలా కుటుంబాలు సుముఖత చూపిస్తున్నాయి. కళ్లు మిరమిట్లు గొలిపే రంగురంగుల విద్యుత్ దీపాల నడుమ కబుర్లు చెప్పుకుంటూ సరదాగా రంజాన్ మార్కెట్లను సందర్శిస్తున్నారు. వివిధ రకాల గృహోపకర వస్తువులను చూస్తూ.. అవసరమైన చోట ఖరీదు చేస్తూ ముందుకు వెళుతున్నారు. దీంతో పాతబస్తీలో ఎటుచూసినా ప్రజల రద్దీతో ఫుట్‌పాత్‌లు, దుకాణాలు కళకళలాడుతున్నాయి.



దుస్తులు ఖరీదు చేస్తున్న వినియోగదారులు

‘ప్రజావాణి’ని సద్వినియోగం చేసుకోవాలి

చార్మినార్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, ఫలక్‌నుమా సర్కిల్ల పరిధిలోని అక్రమ నిర్మాణాలపై 3, ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని ఇంజినీరింగ్ సమస్యలపై 2, సంతోష్‌నగర్ సర్కిల్‌లోని ఆస్తి పన్ను సమస్యపై ఒకటి.. మొత్తం 6 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా నెలకొన్న ప్రధాన సమస్యలను ఈ కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్

తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నూతనంగా నల్గొండ, వరంగల్ ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డిని సోమవారం పీఆర్‌జీటీఏ అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. గురుకుల ఉపాధ్యాయుల వివిధ సమస్యలైన టైం టేబుల్ సవరణ, 010 నుంచి వేతనాలు, కేర్ టేకర్, డిప్యూటీ వార్డెన్ నియామకాలు ఇతర సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పులగం దామోదర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌జీటీఏ నాయకులు ఉప్పు అశోక్, నిర్మలానందం, కొత్తూరి రామకృష్ణారెడ్డి, ఎంజేపీ బీసీ అధ్యక్షులు గుర్రం రమే ష్ గౌడ్, పానుగంటి విజయ్‌కుమార్, చీదేటి లక్ష్మారెడ్డి, చెలకాని సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పికిల్ బాల్ క్రీడను ప్రోత్సహిస్తాం’

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలో పికిల్ బాల్ క్రీడను ప్రోత్సహిస్తున్నట్లు హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌బు తెలిపారు. ఈ ఆటలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వాళ్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు సోమవారం పాడిల్ వేవ్ అనే సంస్థకు చెందిన పికిల్ బాల్, బాక్స్ క్రికెట్, సాకర్ కోర్టులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమెరికా లాంటి దేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన పికిల్‌బాల్ క్రీడను నగరవాసులకు చేరువ చేసేలా క్రీడా కోర్టులను ప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పికిల్ బాల్ సంఘం



పికిల్‌బాల్ క్రీడా కోర్టును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌బాబు

నగర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి శ్రీధర్ ముదిరాజ్, నిర్వాహకులు సుమిరన్, సత్యదీప్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ట్యాంక్ బండ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కమిషనర్ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..గోషామహల్ పాన్‌మండి పక్కన వేల గజాల స్థలాన్ని అక్రమంగా లేఅవుట్ లేకుండా పర్మిషన్ ఇచ్చిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాస్ బాగ్ కాలనీ, సీనా హోటల్ గల్లీ, శంకర్ బాగ్, గాంధీ గల్లీ, తదితర ప్రాంతాల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు గోషామహల్ నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలకు అండగా ఉంటున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హైమద్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాల విద్యార్థుల ఆందోళన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫీజు కడితేనే హాల్‌టికెట్ అందజేసి పరీక్షలు రాయనిస్తామని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులతో తెలపడంతో సోమవారం కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. నిజాం కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో ఎంసీఏ విద్యనభ్యసిస్తున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తమకు హాల్‌టికెట్లు కేటాయించాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్‌ను కోరారు. ఫీజులు కడితేనే హాల్‌టికెట్లు ఇస్తామని ప్రిన్సిపాల్ విద్యార్థులకు తెలిపారు. స్కాలర్‌షిప్ ఎప్పుడు వస్తుందో తెలియదని, కళాశాల నిర్వహణ కోసం ఒక్కో విద్యార్థి రూ.5 వేలు చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలపడంతో విద్యార్థులు మండిపడ్డారు. ఎటువంటి అధికారిక ప్రకటనలు లేకుండా రేపు పరీక్ష అనగా తమను ఫీజులు కట్టాలని కోరడం ఏంటని ప్రశ్నించారు. తమకు తక్షణమే హాల్‌టికెట్లు మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ప్రిన్సిపాల్ దిగివచ్చి కోర్సులు పూర్తయ్యేలోగా స్కాలర్‌షిప్ విడుదల కాకపోతే ఫీజులు చెల్లించాలని విద్యార్థులకు తెలిపి హాల్‌టికెట్లను అందజేశారు.

‘లక్ష్యంపై గురిపెడితే మహిళలు దేనినైనా సాధిస్తారు’

సుల్తాన్‌బజార్: చిత్తశుద్ధితో లక్ష్యంపై గురిపెడితే మహిళలు దేనినైనా సాధిస్తారని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్ మహిళా ఫోరం ఆధ్వర్యంలో వర్చువల్‌గా ఉమెన్స్ డే ఉత్సవాలు అధ్యక్షులు మల్లిపెద్ది నవీన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క పాల్గొని మహిళా సాధికారత కోసం ఆమె చేసిన పోరాటాన్ని వివరించారు. ప్రత్యేక అతిథులుగా ఐఏఎస్ అధికారిణి సుమతి వీ హబ్ సీఈఓ సితా పల్లా చోళ్ల పాల్గొని నాయకత్వం, పరిపాలన ఆవిష్కరణలు, మహిళా వ్యవస్థాపకతలో వారి విశేషమైన కృషిని వివరించారు. తెలంగాణ మహిళలు ఎక్కడ ఉన్నా వారి ముందు ఉన్న సవాళ్లను శక్తివంతంగా ఎదుర్కోవడంలో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ అండగా ఉంటుందని అధ్యక్షుడు మలిపెద్ది నవీన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సమాజంపై విశేష ప్రభావం చూపిన మహిళా మార్గదర్శకులను సత్కరించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పైళ్ల మల్లారెడ్డి, విజయపాల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌రెడ్డి, భరత్‌రెడ్డి, వంశీరెడ్డి పాల్గొన్నారు.

ఏడుగురికి సారస్వత పరిషత్తు ధర్మ నిధి సాహిత్య పురస్కారాలు

సుల్తాన్‌బజార్: ఏడుగురు సాహితీ ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. 2025 సంవత్సరానికి డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్య పురస్కారాన్ని మౌనశ్రీ మల్లిక్‌ను, తిరుమల స్వరాజ్యలక్ష్మి పురస్కానికి డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మను, నారప్పరాజు రాఘవ సీత పురస్కారానికి టి.శ్రీరంగస్వామి, ఆచార్య మడుపు కులశేఖరరావు పురస్కారానికి ఆచార్య గుండె డప్పు కనకయ్యను, డాక్టర్ బి.ఎన్.శాస్త్రి పురస్కారానికి ద్యావనపల్లి సత్యనారాయణను, బూర్గుల రంగనాథరావు పురస్కారానికి డాక్టర్ వి.శంకర్‌ను డాక్టర్ కె.అంజిరెడ్డి పురస్కారానికి బైస దేవదాసును ఎంపిక చేసినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ సాయంత్రం పరిషత్తులోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించనున్నట్లు వివరించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



నివాళులర్పించిన శివకుమార్‌యాదవ్ తదితరులు

జియాగూడ: చదువుతోనే మహిళల జీవితాలు బాగుపడతాయని సావిత్రిబాయి పూలే ఆనాడే గుర్తించి చదువు చెప్పిందని కార్వాన్ అసెంబ్లీ బీజేపీ కో కన్వీనర్ శివకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు సావిత్రి బాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని నవోదయనగర్ చౌరస్తాలో జియాగూడ డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు జిల్లెల వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జగదీష్ యాదవ్, ప్రధాన కార్యక్రమం దర్శి వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు దర్పల్లి నర్సిములు, జుగల్ కిషోర్, రమేష్ చౌగ్లె, తులసి దాస్ సుదర్శన్, జగన్నాథ్, లక్ష్మీనారాయణ, సందీప్, కిషన్‌దామ, అశోక్ బాలాజీ, ప్రణ య్ పాల్గొన్నారు.

బార్కాస్ ఎంకే–11 జట్టు విజయం

గౌలిపురా: బలరాం గోపాల్, మేకల రాజ్ కుమార్ స్మారకార్థం ఈ నెల 7వ తేదీ నుంచి మేకలమండిలోని ఓంకార్ ప్లే గ్రౌండ్ 2వ క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను బార్కాస్‌కు చెందిన ఎంకే-11 టీమ్ గెలుచుకుంది. ఓంకార్ యూత్ అసోసియేషన్, మాతా మాణికేశ్వరి యూత్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 22 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో బార్కాస్ ఎంకే-11 జట్టు, గౌలిపురా-333 జట్టులు తలపడ్డాయి. ఇందులో బార్కాస్ ఎంకే-11 జట్టు విజేతగా నిలిచి టోర్నమెంట్ కప్‌ను కైవసం చేసుకుంది. బార్కాస్ ఎంకే-11 జట్టుకు అసోసియేషన్ ప్రతినిధులు కప్‌తో పాటు రూ.10 వేల క్యాష్ ప్రైజ్, మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో



కప్‌ను బార్కాస్ ఎంకే-11 జట్టుకు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ, యాకుత్‌పురా కంటెస్టెడ్ ఎమ్మెల్యే వీరేంద్రబాబు యాదవ్, నాయకులు ఆదర్ల మహేశ్, కొడి మహేందర్, చర్మాణి రూప్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, సుమన్ కుమార్ ముదిరాజ్, జి.ఎం.జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనుల పరిశీలన

సుల్తాన్‌బజార్: తాగునీటి పైప్‌లైన్ పనులను సోమవారం కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పరిశీలించారు. జాంబాగ్ డివిజన్‌లోని గోషామహల్ పెట్రోల్ పంప్, హిందీనగర్ ప్రాంతాల్లో జలమండలి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద సివరేజ్ లైన్‌వర్క్‌ను మేనేజర్ కులశేఖర్ ఇతర అధికారులతో కలిసి పర్యవేక్షించామన్నారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఈ పైప్‌లైన్ పనులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, సుధీర్‌కుమార్, మయూర్, రఘు, రామకృష్ణ, ప్రవీణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌వర్క్స్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యేను టోలిచౌకీలోని తన కార్యాలయంలో స్థానిక ప్రజలు కలిసి వారి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నా కార్యాలయంలోనే కాకుండా దారుసలామ్‌లో కూడా అందుబాటులో ఉంటున్నానన్నారు. నా దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, సయ్యద్ రఫత్‌హుస్సేన్, అలీముద్దీన్ తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గౌలిపురా: డివిజన్‌లో శిథిలావస్థకు చేరుకున్న రోడ్డు స్థానంలో నూతన సీసీ రోడ్డు వేస్తున్నామని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. అంబికానగర్‌లో సోమవారం రూ.3 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో ఆమె సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రోడ్డు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని స్థానికులు తన దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ ద్వారా నిధులను మంజూరు చేయించి నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. ఇప్పటికే డివిజన్‌లో రోడ్లు, వీధి దీపాలు, సీసీ రోడ్ల తదితర అభివృద్ధి పనులను నిర్వహించడం జరిగిందన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో గౌలిపురా ఏఈ తేజోవంత్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, నాయకులు జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.రాజ్ కుమార్, డి.ప్రవీణ్ కుమార్, రాజు చారి, బస్తీవాసులు హెచ్.అశోక్, పి.రవి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

జీఎన్ఐటీఎస్‌లో ‘రన్ ఫర్ యాక్షన్’



గోల్కొండ: లింగ వివక్షను రూపుమాపేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. షీ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం షేక్‌పేట్‌లోని జీఎన్ఐటీఎస్‌లో ‘రన్ ఫర్ యాక్షన్-జెండర్ ఈక్వాలిటీ రన్’కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి నేడు ఎందరికో దారి చూపామ న్నారు. అసలు మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాలలే అప్పట్లో లేనేలేవని అయితే రాను రాను మహిళల కోసం కళాశాలల సంఖ్య పెరుగుతుందని దీనికి అనుగుణంగా విద్యార్థినుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై ఏమాత్రం వివక్ష చూపకుండా కలిసికట్టుగా ముందుకు సాగేందుకు కృషి చేయాలన్నారు.

వార్షికోత్సవం



గన్‌ఫౌండ్రీ: కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్, ఛత్రినాక బ్రాంచ్లకు చెందిన విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ ఎం.ఏ. షరీఫ్, మేనేజర్ డైరెక్టర్లు తిరుమలరెడ్డి, గొల్ల రామకృష్ణ యాదవ్, అధ్యక్షులు జైపాల్ రెడ్డి, అకాడమీ అకాడమిక్ స్టాండర్డ్ బాలాజీ, ఛత్రినాక బ్రాంచ్ ప్రిన్సిపాల్ నీలం మంజుల, రామంతపూర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ వనజాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన నవవధువు!

లంగర్‌హౌస్: వివాహం అయిన ఏడు రోజులకే ఓ నవవధువు మాజీ ప్రియుడితో వెళ్లిపోయిన ఉదంతం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద మూడు రోజుల క్రితం జరిగింది. అతని చర్యను తను నివసిస్తున్న బస్తీవాసులే వ్యతిరేకించి, అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించిన సంఘటన సోమవారం లంగర్‌హౌస్‌లో కలకలం సృష్టించింది. వివరాలివీ... నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీమందిర్ వద్ద నివసిస్తున్న ఓ యువతి గతంలో లంగర్‌హౌస్‌లో నివసించే అరవింద్ అనే యువకుడిని ప్రేమించింది. తల్లిదండ్రులు ఏడు రోజుల క్రితం ఆమెకు అత్తాపూర్‌కు చెందిన ఓ యువకుడితో వివాహం చేశారు. అయినా మాజీ ప్రియుడితో కొనసాగిన ప్రేమాయణంతో ఆమె అతని వెంట మూడు రోజుల క్రితం వెళ్లిపోయింది. దీంతో తల్లిదండ్రులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తమ కూతురు కనిపించటం లేదని ఫిర్యాదు చేశారు. అది విచారణ కొనసాగుతున్న క్రమంలోనే సోమవారం విషయం లంగర్‌హౌస్‌లోని అతని బస్తీలో తెలిసింది. దీంతో స్థానికులు అతను చేసిన చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. బస్తీలో అతని ఫొటోకు చెప్పుల దండ వేసి ఊరేగించారు.

మహిళలకు సముచిత స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: మహిళలకు సముచిత స్థానం కల్పించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండలోని తన కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్త్రీలలో సహజంగా తెలివితేటలతో పాటు ధైర్య సాహసాలు కూడా ఎక్కువే అని అన్నారు. రాజకీయ రంగంలో కూడా మహిళలకు ప్రాధాన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. తాము ఎంచుకున్న రంగంలో మహిళలు అత్యుత్తమంగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, మహిళా కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.